


రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:25 (సోమవారం సాయంత్రం)
సహర్: 4:55 (మంగళవారం ఉదయం)

పుర, నగరపాలకాల అభివృద్ధికి పన్నులు తప్పనిసరి. ప్రైవేటు నిర్మాణాలైన, కొన్ని మినహా ప్రభుత్వానికి సంబంధించిన కార్యాలయాలకు సైతం సంబంధిత అధికారులు పన్నులు విధించి వాటిని విధిగా వసూలు చేయాలి. అయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం కార్పొరేషన్‌తోపాటుగా, మిగిలిన పురపాలకాల్లో ఆయా ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు వసూలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా రూ.కోట్లలోనే బకాయిలు పేరుకుపోయాయి. పెద్ద మొత్తంలో ఎవరైనా పన్నులు బకాయి ఉంటే వారికి రెడ్ నోటీసులు సైతం జారీ చేస్తారు. అయితే రూ.కోట్లలో రావాల్సిన ప్రభుత్వ కార్యాలయాల బకాయిలపై ఎందుకు దృష్టి సారించడంలేదన్న వాదన వినిపిస్తోంది. కనీసం అటు వైపు కన్నెత్తి చూడని దుస్థితి నెలకొన్నట్టుగా స్పష్టమవుతోంది.



- ఖమ్మం డీఎంహెచ్‌వో భవనం చెల్లించాల్సింది రూ. 1.23 కోట్లు
- బీఎస్ఎన్ఎల్ జీఎం కార్యాలయంపై పన్ను రూ.99లక్షలు
- కొత్తగూడెం జడ్పీపై రూ.56.54 లక్షలు, ఖమ్మం పోస్టాఫీసు టాక్స్ రూ.43.23 లక్షలు
- ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున పేరుకు పోయిన వైనం
- అసలు చెల్లించక పోవడంతో పెరుగుతున్న వడ్డీలు
- వసూళ్లపై దృష్టిసారించని అధికారులు
- కార్యాలయాల వైపు కన్నెత్తి చూడని దుస్థితి

'సర్కారు' బకాయిలు..
వసూలయ్యేనా?

ప్రభుత్వ కార్యాలయాల పెండింగ్ పన్నులు రూ.కోట్లలోనే..

ఖమ్మం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల పన్నులు పెద్ద మొత్తంలో పెరగడానికి సకాలంలో చెల్లించక పోవడమే కారణంగా కనిపిస్తోంది. చెల్లించని పన్నులకు యేటికేడు వడ్డీ పెరుగుతుంది. చాలా కార్యాలయాల్లో అసలుకు రెండింతలు వడ్డీలు బకాయిల రూపంలో ఉన్నాయి. పాల్వంచ శాస్త్రీ రోడ్డులోని ప్రాజెక్టు ఆఫీసర్ పేరు మీద ఉన్న భవనానికి రూ.21.04 లక్షల పన్ను ఉండగా.. అందులో అసలు పన్ను మాత్రం రూ.6.40 లక్షలు మాత్రమే. మిగిలిన రూ.14.22 లక్షలు 2003 నుంచి చెల్లించని పన్నుకు వడ్డీ బకాయి రూపంలోనిది. అదే మునిసిపాలిటీ పరిధిలో ఫారెస్ట్ ఆఫీస్ గెస్ట్ హౌజ్ పేరుమీద రూ.10.78 లక్షలు బకాయి ఉండగా.. అందులో రూ.6.01లక్షలు వడ్డీనే. ఖమ్మం నెహ్రూ నగర్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంపై ఉన్న రూ. 1.23 కోట్లు పన్నులో రూ.82.17 లక్షలు వడ్డీ కాగా.. అసలు పన్ను రూ. 38.98 లక్షలుగా ఉంది. ఇలా ప్రతీ మునిసిపల్, కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పన్నులు చెల్లించని కారణంగా రూ.కోట్ల కొద్దీ బకాయిలు పేరుకుపోయింది.

ఖమ్మం జిల్లా పరిధిలో ఇలా...

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో నెహ్రూనగర్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం పన్ను బకాయి రూ.1.23 కోట్లు, బీఎస్ఎన్ఎల్ జీఎం కార్యాలయం బకాయి రూ.99 లక్షలుగా ఉంది. ఐటీ హబ్‌పై రూ.43.52 లక్షలు, గాంధీచౌక్‌లోని హెడ్‌పోస్ట్ ఆఫీసుపై రూ. 43.23 లక్షలు, జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీపై రూ. 39.37 లక్షలు, పాత కలెక్టరేట్‌పై 10.27 లక్షలు, కొత్త ఆర్టీసీ బస్టాండ్ రూ.10.71 లక్షల పన్ను ఉంది. గతంలో బుర్హాన్‌పురంలో జిల్లా ఈడీబీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ భవనంపై రూ.17.25 లక్షలు, జమ్మిబండ ప్రాంతంలోని ఆర్ అండ్‌బీ ఈఈ కార్యాలయంపై రూ.16.78 లక్షలు, డీఎంవో గెస్ట్ హౌజ్‌పై రూ.3.44 లక్షలు, పీడబ్ల్యూవో గెస్ట్‌హౌజ్‌పై (మిగతా 6వ పేజీలో)

అభివృద్ధి పథకాలు

అడ్డుకుంటే సహించం

- విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పూబెల్లి గ్రామంలో 83 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



పూబెల్లి గ్రామంలో గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

ఇల్లెందు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పేదవాడి కష్టాలను గత ప్రభుత్వం విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అడ్డుకుంటే సహించబోమని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలో, రూరల్ మండలంలో ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.

ఈ పర్యటనలో ఇల్లెందు మండలం పూబెల్లి గ్రామంలో మంజూరైన 83 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించి భూమి పూజ నిర్వహించారు. ఇల్లెందు పట్టణంలో రూ. 37 కోట్ల (మిగతా 6వ పేజీలో)



రేపల్లెవాడలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్
- రేపల్లెవాడలో 94 ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

6



ఆయిల్‌పాం కర్మాగారానికి

టెండర్లు

- ఆసక్తి చూపిన జాతీయ, అంతర్జాతీయ సంస్థలు
- వేంసూరు మండలం కల్లూరుగూడెంలో నిర్మాణం
- త్వరలో శంకుస్థాపన
- మూడేళ్ల క్రితమే పూర్తయిన భూసేకరణ

సత్తుపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలం కల్లూరుగూడెంలో నిర్మించనున్న ఆయిల్‌పాం కర్మాగారానికి సంబంధించి ఆయిల్‌ఫెడ్ అధికారులు టెండర్లు నిర్వహించారు. ఈ మేరకు టెండర్ల ప్రక్రియ మూడు రోజుల క్రితం ముగిసినట్లు తెలిసింది. ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో టెండర్లు ఆహ్వానించగా పలు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు టెండర్లను దాఖలు చేసినట్లు తెలిసింది. టెండర్లు ఖరారు చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించటంతో పాటు రైతులకు ఆయిల్‌పాం కర్మాగారాలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో కల్లూరుగూడెంలో ఆయిల్‌పాం కర్మాగారాన్ని మంజూరు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేటలో ఆయిల్‌పాం కర్మాగారాలు ఉన్న విషయం విధితమే. ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెంచటంతో పాటు జిల్లాకు ఒక కర్మాగారం నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు.

42 ఎకరాల భూసేకరణ

వేంసూరు మండలం కల్లూరుగూడెంలో మూడేళ్ల క్రితం 42 ఎకరాల భూమిని సేకరించి ఆయిల్‌ఫెడ్‌కు అధికారులు అప్పగించారు. ప్రతిపాదిత భూమి చుట్టూ ఫెన్సింగ్ నిర్మించారు. అప్రోచ్ రోడ్డుకోసం ఆరు ఎకరాల భూసేకరణ పూర్తి చేసి రైతులకు ఇటీవల పరిహారం అందజేశారు.

కల్లూరుగూడెంలో ఫ్యాక్టరీ

కల్లూరుగూడెంలో గంటకు 60 టన్నుల సామర్థ్యంలో ఫ్యాక్టరీ నిర్మించాలని ప్రతిపాదించినా ముందుగా 15 టన్నుల సామర్థ్యంతో ఫ్యాక్టరీ నిర్మించి దానిని భవిష్యత్తులో విస్తరించనున్నారు. ఇప్పటికే అప్పారావుపేటలో 30టన్నులు, అశ్వారావుపేటలో 90 టన్నుల సామర్థ్యంతో కర్మాగారాలున్నాయి. మూడేళ్ల క్రితమే కర్మాగారం నిర్మాణం కోసం (మిగతా 6వ పేజీలో)

నేటి నుంచి

'రాజీవ్ యువ వికాసం'

- నిరుద్యోగుల ఉపాధికి చేయూత
- రూ.3 లక్షల వరకు రుణాలతో యూనిట్లు
- మూడు కేటగిరీల్లో రాయితీలు



ఖమ్మం, మార్చి16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిరుద్యోగ యువతకు స్వయంఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కాబోతుంది. రూ.లక్ష నుంచి 3లక్షల వరకు ఉపాధి పొందేలా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి యూనిట్లు ఈపథకం కింద మంజూరు చేస్తారు. ఉమ్మడి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు రాజీవ్ యువ వికాసం నుంచి స్వయం ఉపాధి అందించనున్నారు. అయితే అగ్రవర్ణ పేదలకు (ఈబీసీ)లకు మాత్రం ఉపాధి పొందేందుకు అవకాశం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 5లక్షల మంది నిరుద్యోగ యువతకు లబ్ధిపొందే పరిస్థితి ఉండగా ఉమ్మడిజిల్లాలో 45నుంచి50వేల మంది ఉపాధి పొందే అవకాశం ఉంది.

గిరిజన జనాభా అధికంగా ఉన్నందున భద్రాచలం ఐటీడీఏ గిరిజన యువతకు ఎక్కువ సంఖ్యలో ఈపథకాన్ని అందించబోతోంది. నిరుద్యోగ యువత సంబంధిత కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సోమవారం నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి స్వయం ఉపాధి యూనిట్లను ఎస్సీ, ఎస్టీ (ఐటీడీఏ), బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా అందించనున్నారు. ఇందుకు సబ్సిడీ కూడా అందజేయనుంది. ఈపథకం కింద లబ్ధిదారులకు ఇచ్చే యూనిట్లను మూడు కేటగిరీలుగా విభజించారు. కేటగిరి-1 కింద రూ.లక్ష వరకు రుణం అందించనున్నారు. ఇందులో 80శాతం వరకు సబ్సిడీ ఇస్తారు. కేటగిరి-2 కింద రూ.లక్షనుంచి రూ.2లక్షల వరకు 70శాతం సబ్సిడీ, కేటగిరి-3 కింద రూ.3లక్షల వరకు రుణాలు యూనిట్లు పొందితే 60శాతం రాయితీ పొందే అవకాశం ఉంది. ఏప్రిల్ 6వ తేదీ నుంచి మే 31వరకు దరఖాస్తులల పరిశీలన అనంతరం అర్హుల జాబితాను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రకటించే అవకాశం ఉంది. కాగా ఈ పథకానికి సంబంధించిన విధి విధానాలు సోమవారం వెలువడే అవకాశం ఉంది.

ముఖాముఖి



కొత్త మెనూ అమలు చేస్తున్నాం

జి.జ్యోతి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి, ఖమ్మం

ప్రశ్న: జిల్లాలో ఎన్ని బీసీ హాస్టళ్లు ఉన్నాయి?

జ: జిల్లా వ్యాప్తంగా 31 బీసీ హాస్టళ్లు ఉన్నాయి. మొత్తం 1120 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు.

ప్ర: హాస్టల్ వార్డెన్లు సమయపాలన పాటించటం లేదనే విమర్శలున్నాయి. వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ప్రతి వార్డెన్ హెడ్‌క్వార్టర్‌లో అందుబాటులోనే ఉన్నారు. వార్డెన్లు సమయపాలన పాటించటంలేదనే విషయం నా దృష్టికి రాలేదు.

ప్ర: కొత్త భవనాలు ఎప్పటివరకు అందుబాటులోకి వస్తాయి?

జ: 2025-26 విద్యా సంవత్సరానికల్లా మూడు నూతన భవనాలు అందుబాటులోకి వస్తాయి. ఒక్కో భవనంలో 100మంది విద్యార్థులకు వసతి కల్పించే విధంగా ఏర్పాట్లు ఉంటాయి. మిగిలిన భవనాలకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తాం.

ప్ర: హాస్టళ్ల నిర్వహణకు సంబంధించి బడ్జెట్ పరంగా ఇబ్బందులు ఉన్నాయా?

జ: జిల్లాలో ప్రస్తుతం హాస్టళ్లన్నీ అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. వీటికి సంబంధించి 2022 విద్యా సంవత్సరం నుంచి అద్దెలు పెండింగ్‌లో ఉన్నాయి. సుమారు రూ.80లక్షల వరకు రావాల్సి ఉంది. అద్దెలు సమయానికి రాకపోవటంతో భవనాల యజమానులు హాస్టళ్లు ఖాళీ చేయమని ఒత్తిడి చేస్తున్నారు.

ప్ర: మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా?

జ: జిల్లాలోని అన్ని హాస్టళ్లలో నూతన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం. వంట సరుకుల కోసం టెండర్లు వేశాం. నూతన మెనూలో విద్యార్థులకు పూరీలు, బోండాలు తదితర వంటకాలున్నాయి.

ప్ర: హాస్టళ్లలో కనీస సౌకర్యాలు అందుబాటులో లేవనే విమర్శలున్నాయి.

జ: జిల్లాలోని అన్ని బీసీ హాస్టళ్లలో కనీస అవసరాలకు కలెక్టర్ రూ.6లక్షల నిధులను మంజూరు చేశారు. వాటితో వాటర్ ప్యూరిఫైర్స్, మోడ్రన్ స్టోర్స్ అందుబాటులోకి తెచ్చాం. శిథిలావస్థలో ఉన్న భవనాల నుంచి సురక్షిత భవనాల్లోకి మార్చాం. మూడు సొంత భవనాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. కలెక్టర్ ఆదేశాలతో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించి శిక్షణ, వృత్తిపరమైన శిక్షణ అందిస్తున్నాం. బాలికలకు మహిళా ప్రాంగణంలో, బాలురకు వరంగల్ క్రాస్ రోడ్డులోని తరుణిహాట్‌లో శిక్షణ అందిస్తున్నాం.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం ఖానాపురం హవేలి

పనిలో ముందు..

వేతనాల్లో వెనుక

- వెట్టి చాకిరికి గురవుతున్న ఆర్పీలు
- ఆశ, అంగన్‌వాడీల కంటే తక్కువ చెల్లింపులు
- ఆరు నెలలకోసారి ఇస్తున్న వైనం..

7

విద్యకు బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలి

ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి కార్యవర్గ సభ్యుడు ఇటికాల

6

నోరూరించే

హలీమ్

గొంతెండుతోంది...

- తాగునీటి ఎద్దడి తీర్చాలని గ్రామస్థుల ఆందోళన
- దుబ్బతండాలో వాటర్‌ట్యాంక్ పైకి ఎక్కి నిరసన
- ఎమ్మెల్యే హామీతో ఆందోళన విరమణ

జూలూరుపాడు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తాగునీటి ఎద్దడిని తీర్చాలని మండలంలోని కాకర్ల పంచాయతీ పరిధిలోని దుబ్బతండా గ్రామంలో ఆదివారం గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఆగ్రహించిన యువకులు ఖాళీ బిందెలతో గ్రామంలోని మిషన్ భగీరథ ట్యాంక్ పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం గ్రామంలో మిషన్ భగీరథ ట్యాంక్ నిర్మించినా నీరు సరఫరా కావటంలేదన్నారు. డైరెక్ట్ పైపులైన్‌ను ఏర్పాటుచేసి విద్యుత్ మోటార్ ద్వారా తాగునీటిని అందిస్తున్నారన్నారు. వేసవి సమీపించి ఎండల తీవ్రత అధికం కావటంతో బోరులో నీరు ఇంకి తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. దీంతో తాగునీటి కోసం గ్రామస్థులు గత కొన్ని రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ఆందోళన విషయం తెలుసుకుని మిషన్‌భగీరథ ఏఈ యాస్మిన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు దొండపాటి శ్రీనివాస్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్‌నాయక్ దుబ్బతండా గ్రామాన్ని సందర్శించారు. ఆందోళనకారులతో సమస్యపై చర్చించారు. తాగునీటి ఎద్దడి సమస్యను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.



దుబ్బతండాలో మిషన్ భగీరథ వాటర్‌ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న యువకులు



కనులపండువగా

అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ

- హాజరైన పలువురు ప్రముఖులు, భక్తులు
- 10వేల మందికిపైగా అన్నదానం

6

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని

పోలీసులకు ఫిర్యాదు

నోరూరించే హలీమ్



రంజాన్ స్పెషల్ వంటకాలు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం వచ్చిందంటే చాలు.. నోరూరించే రంజాన్ రుచులు అందుబాటులోకి వస్తాయి. భగభగమండే భట్టీలు.. గరంగరం హలీమ్‌తోపాటు నోరూరించే తియ్యని ఖీర్, ఖుర్బానీ మిఠాయి రుచులు రంజాన్ మాసంలో భిన్న వంటకాలు దర్శనమిస్తాయి. మసాలా వాసనలు గుప్పుమంటుంటే అటు వైపుగా వెళ్తున్న భోజన ప్రియులను అమితంగా ఆకర్షిస్తాయి. ఖమ్మం నగరంలోపాటు వైరా, తల్లాడ, సత్తుపల్లి, మధిర, ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం తదితర ప్రాంతాల్లో ఈ హలీమ్ భట్టీలు దర్శనమిస్తున్నాయి. ఖమ్మం నగరంలో సుమారు 15 ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసి అమ్ముతుండగా, కొన్ని రెస్టారెంట్లలో ప్రత్యేక వంటకంగా తయారుచేసి అమ్ముతున్నారు. రంజాన్ పండుగ అంటే చాలు హలీమ్ సందడి మొదలవుతుంది. షమీ తుక్డా, కద్దూకా ఖీర్, మటన్, చికెన్ బిర్యానీ, కీమా సమోసా తదితర



వంటకాలు నోరూరిస్తాయి. ఈ రంజాన్ మాసంలో తయారుచేసే ప్రత్యేక వంటకాలను ఇష్టంగా తినేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కేవలం ముస్లింలే కాక అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రత్యేక వంటకాలను తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. హలీమ్‌ను మటన్‌తో, హరీస్‌ను చికెన్‌లో తయారు చేస్తారు. హలీమ్‌ఫ్యామిలీ ప్యాక్ రూ.360, హరీస్ ఫ్యామిలీ ప్యాక్ రూ.120లుగా అమ్ముతున్నారు. ముస్లింలు అధికంగా ఫ్యామిలీ ప్యాక్‌లనే పార్శిల్ తీసుకెళ్లున్నారు. ఒక్కో భట్టి వద్ద రోజుకు సుమారు 200 నుంచి 250 వరకు ఫ్యామిలీ ప్యాక్ ఆర్డర్లుగా అమ్ముడుపోతుండగా భట్టీల వద్ద రోజు సుమారు రెండు వందల మందికిపైగా ఈ ప్రత్యేక వంటకాలను తింటున్నారు. దీంతో రోజుకు జిల్లాలో రూ.40 నుంచి రూ.50లక్షల వరకు వ్యాపారం జరుగుతుంది. కేవలం రాత్రి పూట మాత్రమే నడిచే ఈ దుకాణాలకు అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారు. వేకువజామున చేపట్టే ఉపవాస దీక్ష, సాయంత్రం విరమించిన అనంతరం ముస్లింలు ఆహారం తీసుకుంటారు. గోధుమ రవ్వ, 15 రకాల మసాలాలతో నోరూరించే విధంగా హలీమ్ తయారు చేస్తున్నారు. కోడిమాసం, గోధుమ రవ్వ, మసాలాలతో హరీస్‌ను తయారు చేసి ఉడకబెట్టిన కోడిగుడ్డుతో కలిపి అందిస్తున్నారు. నిత్యం జరిగే వ్యాపారం కంటే రంజాన్ మాసంలో జరిగే వ్యాపారం ఎక్కువగా ఉంటుందని దుకాణాదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొందరు దుకాణాదారులు ఇంటి వద్దకు ఉచిత డెలివరీ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఈ దుకాణాలు రాత్రి 11 గంటల వరకు అందుబాటులో ఉంటున్నాయి. రంజాన్ స్పెషల్ వంటకాలను తినేందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావటంతో దుకాణాల వద్ద సందడి వాతావరణం కనిపిస్తుంది.

కనులపండువగా

అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ

- హాజరైన పలువురు ప్రముఖులు, భక్తులు
- 10 వేల మందికి పైగా అన్నదానం

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 10వ డివిజన్ చైతన్య నగర్ బైపాస్ రోడ్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కనులపండుగగా నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠను కేరళ వాస్తవ్యులు తంత్రి తక్కే కోరమంగళం దామోదరన్ నంబూద్రి, పాకతిల్లం నారాయణన్ నంబూద్రి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గావించారు. కేరళ పూజా సాంప్రదాయాల ప్రకారం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం 10:26 నిమిషాల నుంచి 11:30 నిమిషాల మధ్య విగ్రహ ప్రతిష్ఠ పూర్తిచేశారు. ఆలయంలోని గణేష్, నాగేంద్రస్వామి, మాలికాపురుత్తమ్మ, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం ఆలయంలో మహా



హాజరైన భక్తులు



అయ్యప్ప విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

గణపతి హోమం, అంకురపూజ నిర్వహించారు. అయ్యప్పస్వామి గర్భగుడి ముందు సోపాన పూజ, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సుమారు 10వేలమందికిపైగా భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. నూతన ఆలయ ప్రతిష్ఠలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, డీసీసీబీ మాజీచైర్మన్ కూరాకుల నాగభూషయ్య, తుమ్మల యుగంధర్, బాలసాని లక్ష్మినారాయణలు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ముందస్తు చర్యలు చేపట్టారు. భక్తులకు దర్శన అనంతరం తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేకల హనుమంతరావు, డివిజన్ కార్పొరేటర్ చావా మాధురి నారాయణరావు, 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపుడి రమా సతీష్, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, బిక్కసాని జశ్వంత్, నాగండ్ల కోటి, దండా జ్యోతిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు అట్లూరి మధు, టీవీ పుల్లంరాజు, మహేశ్వరం శ్రీధర్ పాల్గొన్నారు.

ఉదయం మంచు.. మధ్యాహ్నం ఎండ

అశ్వారావుపేట రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో ఆదివారం ఉదయం ఐదు గంటలనుంచి దట్టమైన పొగమంచు కురిసింది. ఏడున్నర వరకు మంచు తన ప్రతాపాన్ని చూపింది. రహదారులపై ఎదురుగా ఉన్న వ్యక్తి కూడా కనిపించని పరిస్థితి. రాష్ట్రీయ రహదారులపై వాహనాలు లైట్లు వేసుకునే ప్రయాణాలు సాగించాయి. ప్రస్తుతం ఊహించని విధంగా ఎండలు మండిపోతున్నాయి. పేటలో ఆదివారం దాదాపు 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రత నమోదైంది. సండే వేళ మండిన ఎండలతో రహదారులు జనం లేక వెలవెలబోయాయి. మండుతున్న ఎండలతో ప్రజలు బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. ఉదయం వేళ దట్టమైన మంచు, మధ్యాహ్నం వేళ మండిన ఎండలతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.



ఉదయం ఏడు గంటల ప్రాంతంలో పేటలో దట్టమైన పొగమంచు

ప్లాస్టిక్ రహితం... పర్యావరణ హితం

పూర్వ విద్యార్థుల ప్రయత్నం స్ఫూర్తిదాయకం

తల్లాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 37ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు సమాజ హితం కోసం తమ వంతు ప్రయత్నం చేసి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. అపూర్వ ఆత్మీయ సమ్మేళనాన్ని ప్లాస్టిక్ రహితంగా నిర్వహించి పర్యావరణ పరిరక్షణకు కృషిచేశారు. ఆదివారం తల్లాడలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1987-88 సంవత్సరం పదో తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఒక్కసారి వాడిపారేసే ప్లాస్టిక్ వస్తువులను ఏమాత్రం వినియోగించలేదు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణ హితమైన స్టీల్ వాటర్ బాటిల్స్, రాగి, కాగితం గ్లాసులు, అరిటాకు విస్తర్లు, మట్టి పాత్రలు, దుస్తుల బ్యానర్లు, వేదిక అలంకరణకు పచ్చని గడ్డి, వివిధ రకాల పూలను వినియోగించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు మేడగాని శుభాకర్ దాసు-జయలత, బి.హైమావతి-కిషోర్‌బాబు,



సమ్మేళనానికి హాజరైన పూర్వవిద్యార్థులు

ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్-సరోజిని దంపతులను శాలువలు, పూలతో ఘనంగా సత్కరించారు. మొక్కలు బహూకరించి పర్యావరణ ప్రాధాన్యతను చాటి చెప్పారు. జాతీయస్థాయి గాయనీ గాయకులు లక్ష్మీప్రసన్న, వెంకట్రామిరెడ్డి, దాసరి కృష్ణారావు ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. సినీ డ్యాన్స్ మాస్టర్ అరుణ్‌కుమార్ నృత్యాలు ప్రదర్శించారు.



54 ఏళ్ల తర్వాత...

జూనియర్ కాలేజీ మొదటి బ్యాచ్ సమ్మేళనం

మధిరటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల మొట్ట మొదటి బ్యాచ్ పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం మధిరలోని కోనా కన్వెన్షన్‌లో జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల 1970-71 సంవత్సరం మొదటి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలుసుకుని తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ములకలపల్లి మోహన్‌రావు, కోనా దామోదర్‌రావు, మధు, జనార్ధన్, చీదిరాల వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక

చింతకాని, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని కొదుమూరు ఉన్నత పాఠశాలలో 1998-99 పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు రాచ బంటి రమేష్, లింగాల అచ్చారావు, శ్రీను, తిరపయ్య, శ్రీదేవి, నూరాంబ, నిర్మల, భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని

పోలీసులకు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న సురేష్ నాయక్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్ ఆదివారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రిని అగౌరవ పరిచే విధంగా విచక్షణ మరచి ఫొటోలు మార్ఫింగ్ చేసి పైశాచిక ఆనందం పొందుతూ నిరసన తెలిపిన భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం అయితే బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు రచకొండ సాయి, తరుణ్‌సింగ్, చంద్రకాంత్, శరత్, శాంత, కొత్తగూడెం నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జినుగు అరుణ్, కొత్తగూడెం పట్టణ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఊర్సు శివ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఐదు దశాబ్దాల తర్వాత

పిఠాపురంలో కలుసుకున్న 1974-76 ఐటీఐ విద్యార్థులు



కొత్తగూడెం ఐటీఐ 1974-76 బ్యాచ్ విద్యార్థులు

పిఠాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వారంతా కలిసి చదువుకున్నారు. ఐదు దశాబ్దాల ద్వారా పిఠాపురంలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాల్లోకి వెళ్లి సరదాగా గడిపారు. కొత్తగూడెం ఐటీఐలో 1974-76 మధ్య కలిసి చదువుకున్న విద్యార్థులంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ శివారు రాపర్తి రోడ్డులోని ఫామ్‌హౌస్‌లో ఆదివారం కలుసుకున్నారు. నాటి సంగతులు, కుటుంబాల క్షేమ సమాచారాలు, ఇతర విషయాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. పిఠాపురం పట్టణానికి చెందిన కసిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మధురం, మధురం మన ఆత్మీయ బంధం పేరుతో ఈ అపూర్వ కలయిక జరిగింది. స్వర్ణోత్సవ సందడికి మూడేళ్లు కష్టపడి అందరి చిరునామాలు సేకరించినట్టు నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఐటీఐ బ్యాచ్‌లో ఎక్కువ మంది సింగరేణి సంస్థలో ఉద్యోగాలు చేస్తున్నారు.

అభివృద్ధి పథకాలు అడ్డుకుంటే సహించం

(5వ పేజీ తరువాయి)

అంచనా వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో ఇల్లెందు నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు నిర్మించనున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. ఇల్లెందు మండలంలో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి బోయితండా వరకు రూ.కోటి50లక్షల అంచనా వ్యయంతో కూడిన బీటీ రోడ్డు పనులకు, ఇల్లెందు మండలం రొంపేడు చెక్ పోస్ట్ నుంచి మిట్టపల్లి వరకు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి మామిడిగుండాల వరకు రూ.4కోట్ల46లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న ప్రత్యేక మరమ్మతు పనులు, బీటీ రోడ్ రెన్యువల్ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కలలను సాకారం చేస్తూ ఇందిరమ్మ ఇళ్లను ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున మొదట విడతగా ఇచ్చామని అన్నారు. రాష్ట్రంలో 587 గ్రామాల్లో పైలట్ పథకంలో భాగంగా ఇల్లెందు నియోజకవర్గంలోని పూబెల్లి లో 83 ఇళ్లను అందించామని అన్నారు. గృహ నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని .కేంద్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు పెట్టినా, వెనకడుగు వేయకుండా ఇచ్చిన మాట నిలబెట్టుకుని రాబోయే కాలంలో 20 లక్షల ఇందిరమ్మ గృహాలు కట్టే విధంగా చిత్తశుద్ధితో ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో విద్య, వైద్యానికి పెద్దపీట ఉంటుందన్నారు. గత ప్రభుత్వాలు పేదవాడి కష్టాలను విస్మరించాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పన, గిరిజన,బీసీ, రైతుల అభివృద్ధి, పేదవాడికి చేసే సహాయంలో వెనకడుగు వేయకుండా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రం చేయని విధంగా ప్రతి నియోజకవర్గానికి రూ.200కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో మొదటి విడతగా 58 ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణాలకు రూ.11600 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ పర్యటనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాల్లో ఘన స్వాగతం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆదివారం ఏజెన్సీ గ్రామాల పర్యటనలో ఘనస్వాగతం లభించింది. లలితాపురం వద్ద ఎమ్మెల్యే కోరం కనకయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పూబెల్లి గ్రామంలో కలెక్టర్ జితేష్ వి .పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు స్వాగతం పలికారు.

దండిగా 'సర్కారు' బకాయిలు..

(5వ పేజీ తరువాయి)

రూ.4.32, జిల్లా యువజన సంక్షేమం కార్యాలయంపై రూ. 1.80లక్షలు, చైల్డ్ అండ్ వెల్ఫేర్ కార్యాలయంపై రూ. 1.19లక్షలు, జడ్పీ సీఈవో కార్యాలయంపై రూ. 2.37 లక్షలు ఉంది. రూ. పదివేలు దాటితే కనెక్షన్ తొలగించే ఎన్పీడీసీఎల్ పై రూ.41.60 లక్షలు పన్నుల బకాయి ఉంది. ఎన్పీడీసీఎల్ బకాయిలు ఉన్న కార్యాలయాల్లో హెచ్‌టీ మీటర్లు, అకౌంట్ సెక్షన్, ఎపీటీఎస్ ఆఫీసు, స్టోర్, ఈఆర్‌వో వంటి 15 కార్యాలయాలు ఉన్నాయి.

మధిర మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మార్వో కార్యాలయంపై రెండు అసెస్మెంట్లకుగాను రూ. 11.40 లక్షలు, ఎన్జీవో క్యాంటీన్‌పై రూ. 1.08లక్ష, మండల పరిషత్ పై రూ. 7.35, మండల రిసోర్స్ కార్యాలయంపై రూ. 3.81, మండల పరిషత్ కొత్త కార్యాలయంపై రూ. 1.95, పోస్టాఫీసుపై రూ. 10.89 లక్షలు, సిగ్నల్ టెలీ కమ్యూనికేషన్ కార్యాలయంపై రూ. 2.37లక్షలు, సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో తహసీల్దార్ కార్యాలయంపై రూ. 29.99 లక్షలు, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంపై రూ. 14.58 లక్షలు, ఎంఈవో కార్యాలయంపై రూ. 9.71 లక్షలు, సబ్ ట్రెజరీ కార్యాలయంపై రూ. 7.58 లక్షలు, మండల పరిషత్ కార్యాలయంపై 4.23 లక్షలు, డీఎస్పీ కార్యాలయంపై రూ. 2.72 లక్షలు బకాయిలు ఉన్నాయి.

కొత్తగూడెం జిల్లాలో ఇలా...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని కొత్తగూడెం మునిసిపాలిటీలో జడ్పీ కార్యాలయంపై రూ. 56.54 లక్షలు, ఎండీవో కార్యాలయంపై రూ. 30.77 లక్షలు, ఆర్డీవో కార్యాలయంపై రూ. 28.79 లక్షలు, పీడబ్ల్యూడీ ఆర్అండ్‌బీ కార్యాలయంపై రూ.13.09లక్షల పన్ను బకాయ ఉంది. ఏడీఎస్పీ కార్యాలయంపై రూ. 12.56 లక్షలు, టెలిఫోన్ ఆఫీస్‌పై రూ. 6.51 లక్షలు, ఎంజీరోడ్డులోని పోలీస్ స్టేషన్‌పై రూ. 2.51, బాబుక్యాంపులోని పోలీస్ స్టేషన్‌పై రూ.3.58 లక్షల బకాయిలు ఉన్నాయి. పాల్వంచలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పేరుమీద హమాలీ కాలనీ, శాస్త్రీ రోడ్డు, ఇందిర కాలనీ ప్రాంతాల్లో ఉన్న కార్యాలయాపై రూ. కోటి బకాయి ఉండగా, పోస్టాఫీసుపై రూ. 12.68 లక్షలు, సబ్ డివిజన్ ఫారెస్ట్ అధికారి కార్యాలయంపై రూ. 1.46 లక్షలు, ఫారెస్ట్ గెస్ట్ హౌజ్‌పై రూ. 10.78 లక్షలు, మెడికల్ ఆఫీసర్ గెస్ట్ హౌజ్‌పై రూ. 1.04 లక్ష, మండల రెవెన్యూ అధికారి కార్యాలయంపై రూ. 3.94 లక్షలు, ఫారెస్ట్ రేంజర్ ఆఫీసుపై రూ. 1.29 లక్షలతోపాటుగా కేటీపీఎస్ కోల్‌ప్లాంట్ స్టోర్ ఆఫీస్, సీఈ, ఈఈ, ఎఈల షెడ్ కార్యాలయాలపై పెద్ద ఎత్తున బకాయిలు ఉన్నాయి. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో ఎండీవో కార్యాలయంపై రూ. 2.20 లక్షలు, తహసీల్దార్ కార్యాలయంపై రూ.5.77 లక్షలు ఉన్నాయి.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే

ఏన్కూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన రేపల్లెవాడ గ్రామంలో ఆదివారం 94 ఇళ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు కండ్ల జోళ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్‌పాలనలో ఇళ్ల నిర్మాణం మరుగునపడిందని విమర్శించారు. రాజశేఖరరెడ్డి హయాంలోనే పక్కాగృహాల నిర్మాణం జరిగిందని గుర్తుచేశారు. నిరుపేదలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయించాలని హౌజింగ్ అధికారులను ఆదేశించారు. ఇళ్లు నిర్మించుకోలేని నిరుపేదలకు లోన్‌సౌకర్యం కలిపిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రత్యేక అభివృద్ధికి ఎమ్మెల్యేలకు నియోజకవర్గానికి రూ.10కోట్లు కేటాయిస్తే అందులో రూ.3.50లక్షలు అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధికి కేటాయించామన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొర్ర రాజశేఖర్, జిల్లానాయకులు గుత్తా వెంకటేశ్వరరావు, వడ్డే నారాయణరావు, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, హౌజింగ్ పీడీ శ్రీనివాస్, ఎంపీడీవో అశోక్, ఏవో నరసింహారావు, పీహెచ్‌సీ వైద్యులు రాములు, కేజీబీవీ ఎస్‌వో లావణ్య, మండల నాయకులు ధర్మారావు, ఫైసారావు, మజీద్‌ఖాన్, శోభన్‌నాయక్, లాలునాయక్, నరేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం కర్మాగారానికి టెండర్లు

(5వ పేజీ తరువాయి)

స్థలం సేకరించినప్పటికీ ఖమ్మం జిల్లాలో సాగు చేస్తున్న ఆయిల్ పాం తోటలు పూర్తి స్థాయిలో దిగుబడి రాకపోవటంతో అప్పట్లో నిర్మాణం ముందుకు సాగలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1.10లక్షల ఎకరాల్లో రైతులు ఆయిల్‌పాం సాగుచేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 30వేలఎకరాల్లో ఆయిల్‌పాం విస్తరించి ఉంది. ఖమ్మం జిల్లాలో సాగవుతున్న ఆయిల్‌పాం 15 వేల ఎకరాల నుంచి దిగుబడి వస్తోంది. ఈ మార్చి మాసాంతానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్ష టన్నుల గెలల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. భవిష్యత్తులో దిగుబడులు పెరగనున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని కల్లూరుగూడెంలో మరో కర్మాగారాన్ని నిర్మిస్తున్నారు.

ఆశాజనకంగా ఆయిల్‌పాం ధర

ఆయిల్‌పాంపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచటంతో ఆయిల్ పాంకు గిట్టుబాటు ధర కూడా లభిస్తోంది. ఆయిల్‌పాం గెలలకు కనీస మద్దతు ధర వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వంపై వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వం తరపున వత్తిడి తెస్తున్నారు. దీనితో పాటు ఆయిల్ రికవరీ శాతం తగ్గకుండా, ప్రైవేటు కంపెనీల ప్రభావం పడకుండా మంత్రి తుమ్మల ఆయిల్‌ఫెడ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయిల్ పాం గెలల ధరలు ధర గణనీయంగా పెరిగింది. ఆయిల్‌పాం సాగు లాభసాటిగా ఉండటంతో సాంప్రదాయ పంటల నుంచి ఆయిల్‌పాం సాగువైపు దృష్టి సారించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను ప్రోత్సహిస్తున్నారు. దీనితో పాటు రైతులకు ఆయిల్ పాం మార్కెటింగ్‌లో ఇబ్బందులు కూడా లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ ఉండటంతో రైతులు కూడా ఆయిల్ పాం సాగు చేస్తున్నారు. అయిల్ పాం సాగు విస్తీర్ణం పెద్ద మొత్తంలో పెరిగితే భవిష్యత్తులో ఆయిల్‌పాం గెలలు గానుగకు ఇబ్బందులు లేకుండా కర్మాగారాలు నిర్మించాలనే సంకల్పంతో కర్మాగారం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆయిల్‌ఫెడ్ టెండర్లు నిర్వహించింది.

రూ.87కోట్ల అంచనాతో నిర్మాణం

కల్లూరుగూడెంలో కర్మాగారం నిర్మాణానికి రూ.87కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు టెండర్లు నిర్వహించినట్లు తెలిసింది. మెకానికల్ పనులకు రూ.53కోట్లు, సివిల్, ఎలక్ట్రికల్ ఇతర పనులకు సంబంధించి రూ.34కోట్లు కేటాయించారు. దీనికి సంబంధించి టెండర్లు ఇటీవల నిర్వహించగా పలు సంస్థలు టెండర్లు దాఖలు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం గంటకు 15 టన్నుల సామర్థ్యంతో కర్మాగారం నిర్మించినా భవిష్యత్తులో 60టన్నుల సామర్థ్యానికి విస్తరించనున్నారు. ఉగాది నాటికి కర్మాగారం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి తుమ్మల ఇటీవల ప్రకటించారు.

విద్యకు బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలి

ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి కార్యవర్గ సభ్యుడు ఇటికాల

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు పునాదులు వేసే విద్యావ్యవస్థపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని, విద్యా రంగానికి బడ్జెట్‌లో యేటా కుదింపులు చేస్తున్నారని, రానున్న బడ్జెట్‌లో విద్యకు 30శాతం నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి కార్యవర్గ సభ్యుడు ఇటీకాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా సీపీఐ సమితి జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల మ్యానిపెస్టో సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విధంగా విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు విద్యలో అన్యాయం చేసిందని, ఇప్పుడు ముగ్గురు రాష్ట్ర మంత్రులు ఉండటంతో విద్యా వ్యవస్థను మెరుగుపర్చాలని కోరారు. ఖమ్మంలో విశ్వ విద్యాలయం ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి విస్మరించారని అన్నారు. ఖమ్మంలో విశ్వ విద్యాలయం ఏర్పాటునకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యారంగానికి నిధులు కేటాయించి, విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యపై ప్రభుత్వాలకు చిన్నచూపు తగదన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, సహాయ కార్యదర్శి మధు, నాయకులు శివానాయక్, మనోజ్, ప్రతాప్, సాయి పాల్గొన్నారు.

రామయ్యకు అభిషేకం



ముత్యాలను అందజేస్తున్న ఎండోమెంట్ చైర్మన్

భద్రాచలం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం అంతరాలయంలో ఆర్జిత సేవల్లో భాగంగా అభిషేకం, పుష్పార్చన నిర్వహించారు. ఈ సేవల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ నిర్వహించారు. అలాగే స్వామి వారిని తెలంగాణ దేవాదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్మన్, సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి హైదరాబాద్ మండా వెంకటేశ్వరరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రూ.13 వేలు విలువైన 500 గ్రాముల ముత్యాలను అందజేశారు.

అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా అథ్లెటిక్స్ జట్లను ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికల్లో భాగంగా అండర్- 14, 16, 18 20, సీనియర్ మెన్ అండ్ ఉమెన్ విభాగాలకు 100, 400 మీటర్ల పరుగు పోటీతో పాటు జావెలిన్‌త్రో విభాగంలో పోటీలలో ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 21 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ ఎండీ షఫీక్ అహ్మద్ ప్రకటించారు. బాలుర జట్టులో చరణ్‌గౌడ్, భరత్, గౌతమ్, వివేక్‌చంద్ర, గోపి, వీరభద్రం, మెన్స్ విభాగంలో వేణు, మురళి, బాలికల జట్టులో బిందు, నవ్య, మైథిలి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికలను జిల్లా అథ్లెటిక్స్ సంఘ బాధ్యులు సుధాకర్, రవి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్ తదితరులు పరిశీలించారు.

స్వయం ఉపాధికి దరఖాస్తు చేసుకోండి

భద్రాచలం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ తెగలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ కోరారు. జిల్లాలకు చెందిన షెడ్యూల్ తెగలకు చెందిన యువత **tgb-mmsu.cgg** వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో తెలుసుకోవాలని కోరారు.

జూనియర్ లెక్చరర్‌గా తుమ్మలపల్లి వాసి



కొణిజర్ల, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన మేడా రోశయ్య, వెంకటమ్మల కుమారుడు మేడా నాగరాజు జూనియర్ లెక్చరర్‌గా ఉన్నత ఉద్యోగం సాధించి గ్రామంలో ఆదర్శంగా నిలిచాడు. ఆనాటి గురువు అన్నారపు వెంకటేశ్వర్లు ప్రోత్సాహంతో ఉన్నత స్థాయిలో నిలిచాడు. రాష్ట్రస్థాయిలో 50వ ర్యాంకు సాధించి తొర్రూర్‌లో జువాలజీ లెక్చరర్‌గా అధికారుల నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఈ స్థాయికి రావడానికి గతంలో ఉపాధ్యాయుడుగా పని చేసిన వెంకటేశ్వర్లు అని ఆయన సహకాంతోనే జూనియర్ లెక్చరర్ స్థాయికి ఎదిగానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు నాగరాజుకు అభినందనలు తెలిపారు.

ఆధునిక వైద్యంపై అవగాహన పెంచుకోవాలి

ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి నారాయణరావు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో వస్తున్న ఆధునిక చికిత్సలు, విధానాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి నారాయణరావు అన్నారు. ఆదివారం ఐఎంఏ హాల్లో వైద్యులకు, హస్పిటల్ నర్సింగ్ స్టాఫ్‌కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో వ్యాధులకు చికిత్సల నిర్వహణలో అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. వాటిని పుణికి పుచ్చుకుంటూ వైద్యరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో నిష్ణాతులైన వైద్యులు డాక్టర్ నారాయణరావు మానసిక సమస్యలపై, డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు ఎమోషనల్ బ్యాలన్స్, బేసిక్ లైఫ్ సపోర్టింగ్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ జగదీష్ బాబు, డాక్టర్ సుమంత్‌కృష్ణ, డాక్టర్ మేదరమెట్ల విజయశ్రీ, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ మానస మామిడాల, డాక్టర్ కుసుమరాజు రవికుమార్, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ బొలికొండ శ్రీనివాసరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

అలరించిన స్వేచ్ఛ నాటిక

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నెలనెల వెన్నెల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన స్వేచ్ఛ నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైద్రాబాద్ వారు ప్రదర్శించిన ఆ నాటికకు బీఎం రెడ్డి దర్శకత్వం వహించారు. అనంతరం నటరాజ నాట్యనికేతన్ ఆచార్య మాధవరావు ఆధ్వర్యంలో ప్రణవిక నాట్యం, అభినయరుద్ర నాట్యాలయం గురువు ఫణిల్ కణతాల శిష్య బృందం హ్విలిక, ఇసికల శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రైతు సంఘం రాష్ట్ర నేత నున్నా నాగేశ్వరరావు, మిత్ర గ్రూప్ చైర్మెన్ కురివెళ్ల ప్రవీణ్ హాజరై మాట్లాడారు. అనంతరం నాట్య ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జగన్‌మోహన్‌రావు తదితరలు పాల్గొన్నారు.

పనిలో ముందు.. వేతనాల్లో వెనుక

- వెట్టి చాకిరికి గురవుతున్న ఆర్పీలు
- ఆశ,అంగన్వాడీల కంటే తక్కువ వేతనాలు
- ప్రతీ ఆరు నెలలకోసారి వేతనాలు మంజూరు



మెప్మా సమావేశానికి హాజరైన ఆర్పీలు (ఫైల్)

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లోని పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో క్షేత్రస్థాయిలో అధికారిక, అనధికారిక బాధ్యతలు నిర్వహించే ఆర్పీ(రిసోర్స్ పర్సన్)లు ఎంతో కీలకంగా పనిచేస్తుంటారు. ఉదయం నుంచి రాత్రి ఎస్‌హెచ్‌జీల సమావేశాల వరకు రాత్రింబవళ్లు కష్టపడి పనిచేస్తారు. సంఘాల నిర్వాహణలో ఏదైనా ఆర్థిక ఇబ్బందులు జరిగినా అవకతవకలు జరిగినా ముందుగా సస్పెండ్ చేసేంది ఆర్పీలనే.

రాత్రింబవళ్లు కష్టపడుతూ..

ఖమ్మం జిల్లాలో మొత్తం 239 మంది ఆర్పీలు పనిచేస్తున్నారు. వారిలో ఖమ్మం 169, మధిరలో 29, సత్తుపల్లిలో 24, వైరాలో 24 మంది పనిచేస్తున్నారు. వారు నూతన మహిళా స్వయం సహాయక సంఘాలను నిర్మాణం చేయటంతో పాటుగా 9 పుస్తకాలు నిర్వహణ రెగ్యూలర్‌గా చేస్తుంటారు. బూత్‌లెవల్ ఆఫీసర్‌గా ఎన్నికల ప్రక్రియలో క్రియాశీలకంగా పాల్గొంటున్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులను చేపడ్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్, ఫ్రైడే, డ్రైడేల వంటి కార్యక్రమాల్లో, ప్రజల



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఆర్పీలు (ఫైల్)

ఆరోగ్యం కాపాడటంలో చాలా కీలకంగా పనిచేస్తున్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహనకు సర్వేలకు ఆర్పీలను వినియోగిస్తున్నారు. తాగునీటి కుళాయిలు, మరుగుదొడ్ల వినియోగంపై ఇంటింటి సర్వేలు చేస్తున్నారు. తడి, పొడి చెత్త విడి విడిగా పంపిణీపై ప్రజలకు అవగాహన, ఎల్‌ఆర్‌ఎస్, స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ఆన్‌లైన్ సేవలు చేస్తున్నారు. ప్రకృతి విపత్తులు జరిగిన సమయంలో ఆర్పీలను యుద్ధప్రాతిపదికను వినియోగిస్తున్నారు. వీది వ్యా పారులను గుర్తించి వారికి బ్యాంకు రుణాలు ఇప్పించటం, వ్యాపారాలు ప్రారంబించటంలో ఆర్పీలు క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు, దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఆశలు, అంగన్వాడీల కంటే తక్కువ వేతనాలు

పట్టణ పేదరిక నిర్మూల నుంచి అనేక ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో క్రియాశీలకంగా పనిచేసే ఆర్పీలు తాము వెట్టి చాకిరీకి గురవుతున్నామని వాపోతున్నారు. తమతో పాటే పని చేసే ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ ఉపాధ్యాయులకు నెలకు రూ.7.500 కనీస వేతనం నుంచి రూ.15,000 వరకు పొందుతున్నారు. ఆర్పీలకు మాత్రం నెలకు రూ.6 వేలు మాత్రమే అందుతున్నాయి. అది కూడా ప్రతి ఆరు నెలలకోసారి మాత్రమే వేతనాలకు ప్రభుత్వం బడ్జెట్‌ను విడుదల చేయటంతో ఆర్పీల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

గుట్ట వెంకన్న పెళ్లి వేడుకలు ప్రారంభం

పాల్వంచ టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ శ్రీనివాసకాలనీ శ్రీనివాసగిరి గుట్ట వెంకన్న పెళ్లి వేడుకలు ఆదివారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. అలివేలు మంగ, పద్మావతి సమేత వెంకటేశుడి కల్యాణం ఈ నెల 25న జరగనున్న నేపథ్యంలో స్వామివారిని పెండ్లి కొడుకును చేయడంతోపాటు పసుపు దంచి తలంబ్రాల బియ్యం కలుపుట పనులు వేడుకగా సాగాయి. పెద్ద ఎత్తున తలంబ్రాల బియ్యం కలుపుట పనులు వేడుకగా సాగాయి. పెద్ద ఎత్తున మహిళాభక్తులతోపాటు భక్తులు అధికసంఖ్యలో హాజరు కావడంతో గుట్ట కింద స్వామివారి పాదాల మండపం ప్రాంగణం సందడిగా మారింది. ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్ శర్మ, అరుట్ల ఫణిరాజాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి తెల్లవారురుఝాము నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు,



గుట్ట వెంకన్నకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పసుపు కొమ్ములు దంచుతున్న మహిళలు

నూతన పట్టువస్త్రాల అలంకరణ నిర్వహించారు. దాంతోపాటు సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ విశేషాలను తెలియ చేసే టీజర్‌ను దేవినేని రోజారమణి ఆవిష్కరించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ భక్త సమాజ మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భక్త సమాజ మండలి అధ్యక్షులు అరుట్ల లక్ష్మణచార్యాలు, గౌరవ అధ్యక్షులు పసుమర్తి వెంకటేశ్వరరావు, ధర్మపురి రాము, ఊకే భద్రయ్య, కందకూరి రాము, తాటికొండ శ్రీలత, జిన్నె రమేష్, అంబేద్కర్ మిట్టపల్లి నర్సింహారావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, హిమబిందు, నర్సింహాకుమార్, చనుమోలు శ్రీనివాస్, కిలారు పురుషోత్తం, కంచాల వెంకన్న, మిట్టపల్లి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిలో పురుగుల మందు కలిపి హత్య

- నెలరోజుల పాటు చికిత్స పొంది మృతి
- నిందితుడిపై హత్యానేరం కింద కేసు నమోదు



రోదిస్తున్న రామోజీ కుటుంబ సభ్యులు

తిరుమలాయపాలెం, మార్చి16 (ఆంధ్రజ్యోతి): తాగేనీళ్లలో పురుగు మందు కలిపి ఓవ్యక్తిని హత్యచేసిన ఘటన మండలంలోని సోలిపురంలో జరిగింది. సోలిపురం శివారు పీక్యాతండాకు చెందిన బానోతు రామోజి (58) కాకరవాయికి చెందిన రైతు బూమి కౌలుకు తీసుకుని జీవిస్తున్నాడు. ఇదేతండాకు చెందిన బానోతు రవి రామోజి పక్కన ఉన్న చేనులో కౌలుకు తీసుకుని రవి కూడా వ్యవసాయం చేస్తున్నాడు. గత కొన్నిరోజులనుంచి కూడా రామోజికి, రవికి ఘర్షణలు జరుగుతున్నాయి. రవి.. రామోజీని మాటలతో ఇబ్బందులు పెడుతున్నాడు. ఇదిలా ఉండగా గత నెల 12వతేదీన రామోజీ చేనుకు వెళ్లాడు. అలాగే తాగేందుకు మంచినీటి క్యాను కూడా తీసుకెళ్లాడు. రామోజీ తీసుకెళ్లిన మంచినీళ్లలో రవి పురుగులమందు కలిపాడు. దీంతో ఆ నీరు రామోజీ తాగడంతో స్పృహతప్పి కిందపడిపోయాడు. దీంతో అతన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో నెలరోజుల పాటు మృత్యువుతో పోరాడుతు శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. దీంతో ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రవిపై మొదటగా 307 కింద కేసు నమోదు చేసిన పోలీసులు, పూర్తిస్థాయిలో విచారణ చేయగా రామోజీ తాగిన నీటిలో పురుగుమందు కలిపి హత్యచేసిన రవిపై హత్యానేరం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్పీకర్‌కు బీఆర్‌ఎస్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- కేటీఆర్, జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో శాసనసభ స్పీకర్‌కు కనీస మర్యాద ఇవ్వకుండా దళితుడు అనే విధానంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రొత్సహిస్తున్నారని, స్పీకర్‌కు బీఆర్ఎస్ పార్టీ బహిరంగ క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ సభ్యుడు ఎండీ జావీద్ కోరారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ మంత్రులు, ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాంగ్రెస్ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు దొబ్బల సౌజన్య, మెక్కా శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పెద్ద పీట



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాయల

ఖమ్మం రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీ ఎన్నికలకు ముందు చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా ఖమ్మం రూరల్ మండలం, పొన్నేకల్లులో ఏర్పాటు చేసిన పైలాన్ రెండేళ్ల పూర్తయిన సందర్భంగా పైలాన్‌కు మెరుగులు దిద్ది ఆదివారం పునప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్, గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎన్నికల ముందు చేసిన పాదయాత్రలో ప్రజా సమస్యలను తెలుసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రభుత్వం కొనసాగిస్తుందని తెలిపారు. సంపదను సృష్టించడం దాన్ని ప్రజలకు పంచిపెట్టడం ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్ గౌడ్, నాయకులు వడ్డే నారాయణ, సౌజన్య, అంజనీ, వేణు, నాగరాజు, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణాలను చేపట్టాలి

అదనపు కలెక్టర్ విద్యాచందన

ఇల్లెందు టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జలశక్తి అభియాన్ పథకం ద్వార వార్డుల్లో ఇంకుడుగుంతలను చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇల్లెందు మునిసిపల్ ప్రత్యేక అధికారి విద్యాచందన కోరారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో పూర్తైయ్యే విధంగా వార్డుల్లో పబ్లిక్ స్థలాలు, డ్రైనేజీ చివరి ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టాలని, తక్షణమే ప్రణాళికలను సిద్ధంచేయాలని సూచించారు. వేసవి కాలం దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి లేకుండ తగిన ప్రణాళికలు రూపొందించాలని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని కోరారు. ఇంటి పన్నుల వసూళ్లను మరింత వేగవంతం చేయాలని, 100శాతం వసూళ్ల పూర్తి చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో కమీషనర్ సీహెచ్. కృష్ణ, డీఈ మురళీ, మేనేజరు అంకుషావళి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏదులాపురం కమిషనర్‌గా శ్రీనివాసరెడ్డి



ఖమ్మం రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపల్ నూతన కమిషనర్‌గా ఆళ్ల శ్రీనివాస్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గతంలో ఇల్లెందు మున్సిపాల్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. తల్లాడ ఎంపీడీవోగా, ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా పంచాయతీ ప్రత్యేకాధికారిగా పనిచేశారు. ప్రస్తుతం డీఆర్‌డీఏలో డీపీఎం ఫైనాన్స్ విభాగంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సోమవారం బాధ్యతలు అప్పగిస్తానని ప్రస్తుత కమిషనర్ షఫీ ఉల్లా తెలిపారు.

క్రైం సమాచారం

వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్ చోరీ

అశ్వారావుపేట రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలకుంట, తోగ్గుడెం ప్రాంతాల్లో దాదాపు 30మంది రైతులకు చెందిన వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీ చేశారు. ప్రస్తుతం ఎండలు మండుతున్న తరుణంలో ఉదయాన్నే రైతులు పొలాల వద్దకు వెళ్లి మోటార్లు వేసుకుంటారు. పలువురు రైతులు ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా విద్యుత్ సరఫరా బాక్సు నుంచి మోటారు వరకు ఉన్న కేబుల్ వైరును కట్ చేసి చోరీ చేసినట్లుగా గుర్తించారు. ఈ వైరులో ఉండే కాపర్‌వైరు కోసమే తీగలను చోరీచేసినట్లుగా తెలిసింది. కేబుల్ వైర్లను చివరి వరకు కోయటంతో తిరిగి కొత్తవైరు ఏర్పాటు చేసుకోవాలన్నా రైతులు ఇబ్బందులు పడకతప్పదు. చాలా వైర్లు మోటార్లు లోపలకంటూ కట్ అవ్వడంతో మోటార్లను బైటకు తీసి అమర్చుకోవాలసి వుంటుంది. ఒక్కో రైతుకు నాలుగైదువేల రూపాయలు ఖర్చు అవుతుంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. పొలాల్లో ఉండే వ్యవసాయ పరికరాలు, మోటార్లు పోకుండా దొంగలను పట్టుకొని చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భూ ఆక్రమణదారులపై కేసు నమోదు

ఖమ్మం రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణదారులపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసునమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏదులాపురం రెవిన్యూలో మెట్టు అరుణకు చెందిన 215 సర్వే నంబర్‌లోని 363 గజాల ప్లాటును ఏదులాపురం గ్రామానికి చెందని ఏపూరి శ్రీహరి, ఏపూరి శివ అలియాస్ ప్రతాప్, వి.భుజంగరావులు అక్రమంగా ఆక్రమించారు. ఆ ప్లాట్‌లో మట్టి పోసి విక్రయించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న అరుణ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆమె ఫిర్యాదు మేరకు ఏపూరి శ్రీహరి, ఏపూరి శివ, వి.భుజంగరావులపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎర్రుపాలెం, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచవరం గ్రామ శివారులోగల ఓ మొక్కజొన్న చేలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఎర్రుపాలెం పోలీసులు ఆదివారం అరెస్టుచేశారు. ఎర్రుపాలెం ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం కాచవరం గ్రామంలోని ఓ మొక్కజొన్న తోటలో ఎన్టీఆర్ జిల్లా మొరుసుమిల్లి గ్రామానికి చెందిన 7గురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా స్థానిక సమాచారం మేరకు స్థావరంపై దాడిచేసి సగ్గుర్తి శ్రీను, వెంకటేశ్వరరావు , దోమందుల రాంబాబు, చంటిబాబు, గొల్లపుడి నాగమల్లేశ్వరరావు, మేసిపోగు వెంకటేశ్వరరావును అరెస్టు చేశారు. వీరిలో లంకా రవి పరారీలో ఉన్నాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఈ దాడిలో రూ.3వేలు నగదు నాలుగు మోటారుసైకిళ్లు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం



దగ్ధమైన పూరిల్లు

మణుగూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పగిడేరు గ్రామంలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ పూరిళ్లు పూర్తిగా కాలిబూడిదైం ది. కుంజా కేశవరావుకు సంబంధించిన ఈ పూరింట్లో అకస్మాత్తుగా నిప్పంటుకోని మంటలు వ్యాపించాయని స్దానికులు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని కేశవరావు తెలిపారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పగిడేరు గ్రామానికి చేరుకుని అగ్ని ప్రమాద బాధితుడైన కేశవరావును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబానికి చెందిన కేశవరావు ఇల్లు మొత్తం కాలిపోయి విలువైన వస్తువులు బూడిదయ్యాయన్నారు. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన కుంజా కేశవరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎలాంటి షరతులు లేకుండా ఇందిరమ్మ ఇల్లు బాధిత కుటుంబానికి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అన్నవరపు కనకయ్య, కలగాని బ్రహ్మచారి, నిమ్మల వెంకన్న, కొమరం కాంతారావు, పగిడేరు శాఖ కార్యదర్శి కుంజా నర్సింహారావు, కుంజా రాము తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కి రాని పెద్దమ్మతల్లి పాలక మండలి

- డిప్యూటీ సీఎం, పొంగులేటి వర్గీయుల మధ్య వార్
- నిలిచిన ప్రమాణ స్వీకారం

పాల్వంచ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేరొందిన పాల్వంచ మండలంలోని కేపీ జగన్నాథపురంలో గల పెద్దమ్మతల్లి ఆలయం పాలక మండలి లేక ఏడాది కాలం కావస్తోంది. ఈ నామినేటెడ్ పాలక మండలి వివాదం ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి వర్సెస్ మంత్రి పొంగులేటి శ్రీనవాసరెడ్డి వర్గీయులు మధ్య వార్ జరుగుతోంది. భట్టి వర్గీయులు ఈ నెల 6న రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఖరారు చేసిన చైర్మన్, సభ్యుల లేఖను తెచ్చుకుని ఇక్కడి దేవస్థానం ఈవోకు అందచేశారు. అయినప్పటికి ప్రమాణస్వీకారం చేయించకపోవడంతో ఇరువర్గీయులు మధ్య పోరు తారాస్థాయిలో జరుగుతోంది. పెద్దమ్మతల్లి దేవస్థానం చైర్మన్ పీఠం కోసం మొదటి నుంచి మంత్రి పొంగులేటి వర్గీయులు గట్టి ప్రయత్నం చేసుకుంటూ వస్తున్నారు. తమకే అధ్యక్ష పీఠం దక్కుతుందని ఆశలు పెట్టుకున్నారు. మంత్రి అనుచరులు ఇక దేవాదాయశాఖ నుంచి ఆదేశాలు రావడమే ఆలస్యం ఇన్నట్లుగా చెప్పుకున్నారు. అన్యూన్యంగా ఈ నెల 6న డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క వర్గీయులు చైర్మన్ పదవీతో పాలక మండలి సభ్యులు జాబితాను అధికారికంగా రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ నుంచి తెచ్చుకుని స్థానిన ఈవోకు అందచేశారు. దీంతో డిప్యూటీ సీఎం భట్టి వర్గీయులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ మంత్రి పొంగులేటి వర్గీయులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆ పాలక మండలిని నిలిపివేయాలని మంత్రికి తెలిపినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మంత్రి దేవదాయశాఖ కమీషనర్ చెప్పి ఖరారైన పాలక మండలిని నిలిపివేసినట్లు తెలిసింది. భట్టి వర్గీయుల పాలక మండల కమిటీ ప్రమాణ స్వీకారం ప్రస్తుతం ఆగిపోవడంతో ఇరువర్గీయులు పాలక మండలి ఎన్నికలపై సర్వత్రా చర్చ సాగుతోంది.

మౌనం వహించిన సీపీఐ

ఇక్కడ దేవస్థానం పాలక మండలి కమిటీ నామినేటెడ్ ఎన్నికలపై సీపీఐ మౌనం వహిస్తోంది. దేవస్థానం పాలక మండలిలో తమ పార్టీకి చెందిన ఆరుగురి సభ్యులుకు స్థానం ఇవ్వాలని సీపీఐ.. కాంగ్రెస్ పార్టీ నాయకులను కోరింది. చర్చలు జరిగినట్లు తెలిసింది. వాస్తవంగా పాలక ండలి ఆమోదానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని శివరావు సిఫార్సు కూడా ఉంటుంది. భట్టి వర్గీయులు పాలక మండలి కమిటిని వ్యూహాత్మకంగా తెచ్చుకున్న కమిటీలో సీపీఐ సభ్యులు లేకపోవడంతో మౌనం వహించినట్లు చర్చ సాగుతోంది. కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల పరిధిలో పెద్దమ్మల్లి దేవాలయం ఉన్నందున ఈ గ్రామాల వారికే పాలక మండలిలో ప్రథమ స్థానం దక్కాలని కాంగ్రెస్ నాయకులు గంధం నర్సింహారావు తదితరులు పట్టుపడుతున్నారు. అసలు అమ్మవారి ఆశీస్సులు ఎవరికి దక్కుతాయో అని పలువురు చర్చించుకుంటున్నారు.



పెద్దమ్మ తల్లి ఆలయం (ఫైల్)

నేడు కేఎంసీలో ప్రజావాణి రద్దు



ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి16(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రతి వారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేస్తున్నట్లు కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రకటించారు. రెవెన్యూ అధికారులు ఆదాయ వసూళ్లు, పట్టణ ప్రణాళిక అధికారులు ఎల్ఆర్ఎస్ పనులతో క్షేత్రస్థాయిలో పరిశీలన కారణాలతో ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు కేఎంసీ ఆన్‌లైన్‌లో కూడా వినతులు పంపాలని కోరారు.



ముగిసిన అంకమ్మ జాతర



ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి15(ఆంధ్రజ్యోతి):కైకొండాయిగుడెం వెళ్లే ప్రధాన రహదారి వెంట కొలువైఉన్న శ్రీ అంకమ్మ తల్లి, మహాలక్ష్మమ్మ, ముద్దిరావమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. భక్తులు ఆలయ ప్రాంగణంలో అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. కొందరుభక్తులు చీరె,గాజులు,జాకెట్ ముక్కలు, పూలు, పండ్లను అమ్మవారికి సమర్పించారు. ఆలయం ప్రతిష్ఠించి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు విరాళాలతో ఆదివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 2వేలమంది భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కొమ్ము భాస్కర్, రామాచారి, యలమందల రామారావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గుండాలను శిక్షించాలి

ఖమ్మంరూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తీర్థాల గ్రామానికి చెందిన పాలేరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిరణ్ కుమార్‌పై దాడి చేసిన బీఆర్ఎస్ గుండాలను చట్టరీత్యా శిక్షించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్ పోలీసులను కోరారు. తీర్థాలకు చెందిన బానోత్ కిరణ్ కుమార్‌ను ఆదివారం ఆయన పరామర్శించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్‌లో కిరణ్‌తో మాట్లాడించారు. అధైర్యపడవద్దని అండగా ఉంటానని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు.

రైల్వే గేట్ మూసివేతలు

- గాంధీచౌక్‌లో ఆరు నెలలుగా నగరవాసుల ఇబ్బందులు
- వంతెన నిర్మించాలని స్థానికుల డిమాండ్

ఖమ్మంగాంధీచౌక్, మార్చి16(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని వరంగల్- విజయవాడ మార్గంలో చేపడుతున్న మూడో రైల్వే లైన్ పనుల కారణంగా ఆరు నెలల క్రితం గాంధీచౌక్ రైల్వే గేట్‌ను మూసివేశారు. నగరంలోని చర్చికాంపౌండ్- ప్రకాష్ నగర్ మార్గంలో ఉన్న రైల్వే వంతెన నుంచి గాంధీచౌక్, కమాన్ బజార్ వైపు మధ్య గేటు వరకు, వంతెన కింద నుంచి రైల్వేలైన్ నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఆవంతెన కింద నుంచి నర్తకి టాకీస్, ఇనుప దుకాణాలు, మధ్య గేట్ వరకు ఉన్నరోడ్డుపై రైల్వే లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తొలుత పాక్షికంగా, తర్వాత పూర్తిగా గాంధీచౌక్ రైల్వేగేటును మూసివేశారు. దీంతో శ్రీనివాసనగర్, గుట్టలబజార్, ప్రకాష్‌నగర్, గాంధీచౌక్, త్రీటౌన్ ప్రాంతాల వారితో పాటు ముదిగొండ, చింతకాని, బోనకల్, నేలకొండపల్లి మండలాల నుంచి వచ్చే ప్రజలు టూటౌన్, వన్‌టౌన్‌వాసులు గాంధీచౌక్ వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. మూడో రైల్వే లైన్ నిర్మాణం కారణంగా ఈ ప్రాంతంలో రాకపోకలను నిషేధించారు. ఈ మార్గంలో ఉన్న పలు వ్యాపార సంస్థలను కూడా తొలగించారు. కొందరు యజమానులు సంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించారు.

ప్రజల ఇక్కట్లు..

ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్ నుంచి త్రీటౌన్‌కు అనుసంధానంగా ఉన్న గాంధీచౌక్ రైల్వే గేటును మూసివేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే మయూరీ సెంటర్, వెంకటగిరి గేటు వంతెన మీదుగా వెళ్లాల్సి వస్తోంది. గేటు మూసివేతకు ముందు కూడా ప్రజలు ఇక్కట్లకు గురయ్యేవారు. ఈగేటుగుండా నిత్యం సుమారు 40 వేలమంది ప్రజలు అటు నుంచి ఇటు ఇటు నుంచి అటు రాకపోకలు సాగించేవారు. ప్రధానంగా ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు ఈ గేటును ఉపయోగించేవి. అయితే ఖమ్మం రైల్వే స్టేషన్ గుండా ప్రయాణం సాగించే సుమారు 80కిపైగా రైళ్లతోపాటు గూడ్సు రైళ్ల వల్ల ఈ గేటు ఎప్పుడు చూసినా వేసి ఉండేది. దీంతో వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు రెండు వైపులా నిలిచి ఉండేవి.

వంతెన నిర్మాణం కోసం డిమాండ్..

గాంధీచౌక్ రైల్వేగేటు ప్రాంతంలో వంతెన నిర్మించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. గాంధీచౌక్, కమాన్ బజార్‌కు అనుసంధానంగా మినీవంతెనను నిర్మించాలని పలు రాజకీయ పార్టీలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. పలు మార్లు సంతకాల సేకరణ కూడా చేశారు. గేటు మూసివేతవల్ల గాంధీచౌక్ హరకరబాయి సెంటర్, ప్రకాష్‌నగర్ సుందరయ్యనగర్, పంపింగ్‌వెల్ రోడ్డు, ప్రజలు కమాన్ బజార్ వెళ్లడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. కమాన్ బజార్ నుంచి గాంధీచౌక్ రావాలంటే చర్చికాంపౌండ్ బ్రిడ్జీ,పాత బస్టాండ్ దగ్గర బ్రిడ్జీ గాని ఉపయోగించి చుట్టూ తిరిగి రావాల్సి ఉంటుంది. దీంతో ట్రాఫిక్ అంతరాయంతో పాటు పెట్రోల్ ఖర్చు అధికం అవుతోంది.



గాంధీచౌక్‌లో మూసివేసి ఉన్న రైల్వే గేట్

వంతెన నిర్మించాలి

నకిరకంటి సతీష్‌కుమార్



ఖమ్మంలోని వన్ టౌన్, టుటౌన్‌ను త్రీ టౌన్‌తో కలిపే గాంధీ చౌక్ వంతెన మూసివేతతో చాలా ఇబ్బందిగా ఉంది. అటునుంచి ఇటు ఇటు నుంచి అటు వెళ్లడానికి చాలా దూరం ఉంది. చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి వెంటనే ఈ ప్రాంతంలో వంతెనను నిర్మించాలి. వంతెన నిర్మాణంతోనే ఆ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

ఎప్పుడుచూసినా మూతే

ఆర్ మనోహర్‌రావు



మూడో రైల్వేలైను పనులు ప్రారంభం కావడంతో గాంధీ చౌక్ గేటును మూసివేశారు. ఆరు నెలలుగా నగరవాసులు ఇబ్బంది పడుతున్నారు. మూడో లైను పనులకు ముందు కూడా ఎప్పుడు చూసినా రైల్వేగేటు మూసి ఉండేది. దీంతో విపరీతంగా ట్రాఫిక్ సమస్యలు వచ్చేవి. గేటుకు రెండు వైపులా వందల సంఖ్యలో వాహనాలు ఆగుతున్నాయి.

సిటీ బస్టాండ్‌లో సౌకర్యాలు నిల్

- మంచినీటి సౌకర్యం, మూత్రశాలలు నామమాత్రం
- ప్రయాణికులకు సరిపడా లేని బస్సులు
- బస్టాండు ఆవరణలోని షాపుల్లో అధిక ధరలు



ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి16 (ఆంధ్రజ్యోతి): సిటీబస్టాండులో సౌకర్యాలు మాత్రం అధ్వానంగా ఉన్నాయి. ప్రయాణికులకు కనీసం తాగడానికి నీరు, కూర్చోవడానికి కుర్చీలు లేక, నిలబడేందుకు వీలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలతో బస్టాండుకు వచ్చిన ప్రయాణికుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. బస్టాండు ఆవరణలో ఫ్యాన్లు, టీవీలు, సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. బస్టాండు ఆవరణలో ఉన్న షాపులు వారు ఉన్న రేట్ల కంటే అధిక ధరలు వసూలు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటంలేదని చెబుతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని పలు దుకాణాలలో నిషేధిత గుట్కాలు, అంబర్ ప్యాకెట్లు అమ్ముతున్నాప్పటికి సంభందిత అధికారులు నామమాత్రపు జరిమానాలు విధిస్తున్నారు. సిటిబస్టాండ్‌లో నామమాత్రంగానే మూత్రశాలలు, మంచినీటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మూత్రశాలలకు వెళ్లె ప్రయాణికుల వద్ద నుంచి పైసల్ వసూలు చేస్తున్నా మూత్రశాలలు కంపు కొడుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు.

ఆటోలదే రాజ్యం

ఖమ్మం నుంచి కోదాడ, మహబూబాబాద్, బోనకల్, కొత్తగుడెం, సూర్యపేట, ఇల్లెందు తదితర ప్రాంతాలకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు గతంలో కన్నా తక్కువగా ఉన్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిటిబస్టాండ్‌ల్లో ఆటోలు బస్టాండ్ ఆవరణలోకి వచ్చి ప్రయాణికులను తీసుకెల్తున్నా ఆర్టీసీ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ద్విచక్ర వాహనాలు బస్టాండ్ పార్కింగ్‌లో పార్కింగ్ చేయకుండ ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తూ ప్రయణికులకు, బస్సులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు.

రోజుకు పదివేలమంది ప్రయాణం

రోజుకు 10వేల మందికి పైగా ప్రయాణికులు సిటీబస్టాండ్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. వారికి తాగునీరు కోసం ఓ ఫ్రిజు ఏర్పాటు చేయటంతో ఆ నీరు ఉదయం సమయంలోనే పూర్తిగా అయిపోతుందని, తరువాత మంచినీళ్లు కొనుకునే తాగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ప్రయాణికులు చెబుతున్నారు.

విచారణ కేంద్రం నామమాత్రం

విచారణ కేంద్రంలోని సిబ్బంది ప్రయాణికులకు సరైన సమాధానం చెప్పకుండా చిరాకుగా మాట్లాడుతున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి. . బస్సులు వచ్చేదాగ ఆగలేరా అంటూ ప్రయాణికులపై దురుసుగా మాట్లాడుతున్నారని ప్రయాణికులు చెబుతున్నారు.

పేరుకే సీసీ కెమోరాలు

సిటీబస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమోరాలు పేరుకు అన్నట్లు ఉంది. రోజుకు వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న బస్టాండ్‌లో నాసిరకం కెమోరాలు అమర్చారని, కెమోరాల్లో రికార్డ్ అయిన పుటేజీలలో సరిగా కనబడకుండా మసకమసగా ఉంటుందని తెలుస్తోంది. ఇటీవల ఓ విద్యార్థి ఖమ్మం నుంచి ఓ గ్రామీణ ప్రాంతానికి వేళేందుకు బ్యాగుతో బస్టాండ్‌కు వచ్చింది. ఆబ్యాగులో వివిధ ధ్రువపత్రాలు ఉన్నాయి. ఆమె కూర్చున ప్రాంతంలోనే మరో మహిళ కూర్చోని ఉంది. విద్యార్థి మూత్రశాల వెళ్లి వచ్చేసరికి బ్యాగ్ పోయింది. పక్కనే కూర్చున మహిళా కానరాకపోవటంతో వెంటనే డ్యూటీలో ఉన్న ఆర్టీసీ సిబ్బందికి, పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు సీసీ కెమోరాలను పరిశీలించగా ఆ మహిళకు సంభందించి పుటేజ్ సరిగి కనిపించకపోవటంతో, రోడ్డుపై ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమోరాలో చూడాల్సి వచ్చింది.

దంపతులను ఆశీర్వదించిన మంత్రి తుమ్మల



ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి16(ఆంధ్రజ్యోతి): నగరంలోని కైకొండాయిగుడెంలోని మాలోత్ మంగ్య కుమార్తె కావ్యవినోద్‌కుమార్ వివాహం ఆదివారం జరిగింది.ఈ వేడుకకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. నవవధువులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మంజిల్లాలో రైతులు పండించిన పత్తి, మిర్చి పంటలకు గిట్టుబాటు ధర కలిపించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ కోరారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 28న కలెక్టరేట్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈకార్యక్రమానికి రైతులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న అజయ్‌కుమార్



ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి16 (ఆంధ్రజ్యోతి):ఖిల్లామసీద్‌లో ఆదివారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి పువ్వాడఅజయ్‌కుమార్ పాల్గొన్నారు. రంజాన్ ఎంతో పవిత్రమైనదని,ముస్లీం మైనారిటీ సోదరులు అందరు ఎంతో నిష్టతో రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తారన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మెన్ ఖమర్, కార్పోరేటర్ మక్బుల్, షౌకత్అలీ, నాగండ్ల కోటేశ్వరరావు, జశ్వంత్, నజీముద్దీన్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

రోజుకు రూ.50లక్షల వసూళ్లు లక్ష్యం

- కమర్షియల్ ప్రాంతాల్లో రాత్రి సమయంలో కలెక్షన్‌కు వెళ్లాలి
- నెలాఖరుకు రూ.32 కోట్ల ఆదాయ వసూళ్లు పూర్తి కావాలి
- బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లకు అసిస్టెంట్ కమిషనర్ ఆదేశం



ఆదాయ వసూళ్లలో పాల్గొన్న ఏఎంసీ అహ్మద్ షఫిఉల్లా

ఖమ్మంసంక్షేమ విభాగం, మార్చి16 (ఆంధ్రజ్యోతి): ఆదాయ వసూళ్ల తుది గడువు సమీపిస్తుండటంతో రోజుకు రూ.50లక్షల ఆదాయ వసూళ్ల లక్ష్యంతో బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు పనిచేయాలని ఖమ్మం నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా హెచ్చరించారు. ఆదివారం కేఎంసీలో బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లతో రెవెన్యూ కలెక్షన్‌పై సమీక్షించారు. ఆదాయ లక్ష్యాలు రోజువారీగా పూర్తి కాని ఉద్యోగులను ప్రశ్నించారు. మీపనితీరు నాకు తెలుసు మరో పక్షం రోజులే గడువు ఉంది కాబట్టి ఖచ్చితంగా పనిచేయాలని మందలించారు. నివాస ప్రాంతాల్లో ఉదయం, కమర్షియల్ ప్రాంతాల్లో రాత్రి 9 గంటల సమయంలో వెళ్లితే ఆదాయ వసూళ్లు జరుగుతాయని సూచించారు. ఇప్పటి వరకు ఖమ్మం నగర పాలక సంస్థకు రూ.25 కోట్లు వసూలు జరిగిందని, మరో రూ.8కోట్లు ఆదాయం రాబట్టాల్సిందే అని ఆదేశించారు. ఆదాయ వసూళ్లలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పూర్తి స్థాయిలో బాధ్యత వహించాలన్నారు. ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన ఐదుగురు బిల్ కలెక్టర్లుతో వసూళ్ల పర్యవేక్షణ చేయాలన్నారు. ఇప్పటి వరకు 1200 మంది వ్యాపారులకు రెడ్ నోటీసులు జారీ చేశారని వారిలో ఇంకా ట్యాక్స్ చెల్లించని వారి వివరాలను తీసుకున్నారు. సాయంత్రం బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లతో కలిసి ఏఎంసీ షఫీఉల్లా కమర్షియల్ ప్రాంతాల్లో ఆదాయ వసూళ్లకు వెళ్లారు. పలువురు వ్యాపారులను కలిసి ఆదాయ వసూళ్లు చేపట్టారు.

ముగిసిన ఏకలవ్య పరీక్షలు



పరీక్షలను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్

రఘునాథపాలెం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశానికి ఆదివారం పరీక్షలు నిర్వహించారు. రఘునాథపాలెం గిరిజనగురుకులంలో ఉదయం 10.30గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. 505మంది విద్యార్థులకు 472 మంది హాజరైనారు. ప్రిన్సిపాల్ మల్లేల బాలస్వామి పరీక్షలను పర్యవేక్షణ చేశారు.

అమరజీవి త్యాగాలు మరువలేనివి



సమావేశానికి హాజరైన ఆర్యవైశ్య ప్రముఖులు

నేలకొండపల్లి, మార్చి16(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివని కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. నేలకొండపల్లిపట్టణ, మండల ఆర్య వైశ్య సంఘాల ఆధ్వర్యంలో నేలకొండపల్లి ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆదివారం ఉదయం తుంబూరు దయాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. వాసవీభవన్‌లో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆర్యవైశ్య కార్పోరేషన్ ఛైర్మన్ ఆవిష్కరించారు.ఆర్యవైశ్య సంఘంఆధ్వర్యంలో నేలకొండపల్లిలో పొట్టిశ్రీరాములు విగ్రహాన్ని ప్రతిష్ఠించిన విగ్రహ నిర్మాణ కమిటీని దయాకర్‌రెడ్డి అభినందించారు.కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు,పట్టణ, మండల ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సరికాదు

ఖమ్మం వ్యవసాయం: వాసవి హైదరాబాద్ నగరంలోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయానికి పొట్టిశ్రీరాములు పేరు తొలగించాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనపై ఆదివారం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జిల్లా, నగర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పసుమర్తి చంద్రరావు మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చడం సరైన పద్ధతి కాదని అన్నారు. పొట్టి శ్రీరాములు ఎంతోత్యాగం చేస్తే తెలుగు రాష్ట్రా లు ఉద్భవించాయని అన్నారు. ఈ ఆలోచన ఎంతో బాధాకరమని అన్నారు. ఈ సమావేశంలో గుమ్మడవెల్లి శ్రీనివాసరావు,మేళ్లచెరువు వెంకటేశ్వరరావు,గోళ్ల రాధాకృష్ణ చిన్నికృష్ణారావు, దేవకి వాసుదేవరావు, సన్నే ఉదయ ప్రతాప్, కొప్పు నరేష్, కొత్త వెంకటేశ్వరరావు, పాల్వాయి వెంకటేశ్వరరావు, కొణతం లక్ష్మీనారాయణ, పాల్వాయి సీతయ్య, విన్నమూరి సుబ్బారావు, మిట్టపల్లి రవి,ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.



నేలకొండపల్లిలో పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దయాకర్‌రెడ్డి

పేదలందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి16 (ఆంధ్రజ్యోతి): జాతీయఉపాధి హామీ పథకంతో సంబంధం లేకుండా అర్హత కలిగిన పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఆత్మీయ భరోసా పథకం వర్తింప చేయాలని సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకండ కాంతయ్య డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం విస్తృత స్థాయి సమావేశం ఆదివారం ఖమ్మంలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. బడ్జెట్‌లో నిధులు కుదింపే ఇందుకు కారణంగా ప్రకటించారు. రైతుభరోసా వలే కూలీ భరోసా పథకాన్ని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రతీ కూలీ కుటుంబానికి రూ.12వేలు కూలీ భరోసా ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో రోజుకూలీ రూ.700 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మీయభరోసా పథకానికి 20 రోజులు పనిప్రతిపాదనతో పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. పగిడిపల్లి ఏసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, దండు ఆదినారాయణ, అయోధ్య,రామలక్ష్మీ, కంపసాటి వెంకన్న, బాణోత్ రామూర్తి, బత్తిన సీతారాములు, మేళ్లచెరువు వీరబాబు, రమేశ్ పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు కేఎల్

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే కొండపల్లి లక్ష్మీనర్సింహారావు ఆదర్శ కమ్యూనిస్టు అని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం సీపీఎం జిల్లా కమిటీ కార్యాలయం సుందర్య భవన్‌లో కేఎల్ 14వ వర్ధంతి సభ నిర్వహించారు. 1952లో పీడీఎఫ్ అభ్యర్థిగా ఇల్లందు నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలు గెలిచారన్నారు. 1964లో కమ్యూనిస్టు పార్టీలో మార్పులు కారణంగా సీపీఎంలోకి వచ్చారని వివరించారు. ఈ సభలో రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు,ఎం సుబ్బారావు, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, వై శ్రీనివాసరావు, నర్రా రమేష్, వాసిరెడ్డి వీరభద్రం, పగడాల నాగేశ్వరరావు, నెల్లూరి వీరబాబు, జె.వెంకన్న, తుడుం ప్రవీణ్, వినోద్, గుమ్మడి బిక్షం, పాపిట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

పోరాట యోధుడు పుసులూరి బుచ్చయ్య

తిరుమలాయపాలెం, మార్చి16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన పుసులూరి బుచ్చయ్య పోరాట యోధుడని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తెట్టెలపాడులో బుచ్చయ్య, అచ్చమ్మ,పేరాల రాములు, వంగూరి వెంకయ్య, పుసులూరి సత్యమయ్య, భద్రమ్మల వర్ధంతి సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రవన్న ట్రస్టు కార్యదర్శి పుసులూరి నరేందర్, సుడిగాలి కిషన్‌రావు, నెల్లూరి వెంకటేశ్వరరావు, బందెల వెంకయ్య, తిమ్మిడి హనుమంతరావు,ఎస్.వెంకటేశ్వర్లు,పుసులూరి పుల్లయ్య, పుసులూరి గిరిబాబు, పుసులూరి వెంకటయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి
ZONE
సోమవారం 17 మార్చి 2025
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY

నత్తనడకన రోడ్డు నిర్మాణం

» నిర్మాణ జాప్యంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు » పట్టించుకోని అధికారులు





కొనసాగుతున్న మధిర-జగ్గయ్యపేట రోడ్డు

పల్టీకొడుతున్న సుబాబుల్ లోడ్‌తో ఉన్న లారీ

వైరా, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వైరాలోని మధిర-జగ్గయ్యపేట రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న జాప్యంతో వాహన చోదకులు, ప్రజలు నరకం చూస్తున్నారు. భారీ వాహనాలు పల్టీకొడుతుండటంతో గంటలకొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఈ రోడ్డులోనే కీలకమైన కమ్మవారి కల్యాణ మండపం ఉండటం, ఇటీవల కాలంలో వివాహాలు ఇతర శుభ కార్యక్రమాలు జరుగుతుండటంతో ఈ రోడ్డు నిర్మాణ పనుల నత్తనడకన వలన అన్నివర్గాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. శనివారం వైరాలో కాంగ్రెస్ నాయకుడు కుమారుడి వివాహ కార్యక్రమం సందర్భంగా భారీగా వాహనాలు తరలిరావడం అదే సమయంలో జగ్గయ్యపేట నుంచి వైరా వైపు సుబాబుల్ లోడ్‌తో వస్తున్న ఒక లారీ పల్టీకొట్టడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. దాదాపు గంట సేపు ట్రాఫిక్ స్తంభించడంతో స్వయంగా వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, సీఐ ఎన్.సాగర్ ఆధ్వర్యంలో ఎస్ఐలు సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను క్లియర్ చేయడం కోసం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఈ వివాహానికి మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ రావడంతో ట్రాఫిక్‌ను క్లియర్ చేయడం పోలీసులకు కొంత సేపు సవాల్‌గా మారింది. రూ.12కోట్ల నిధులతో నాలుగులైన్ల రోడ్డు నిర్మాణాన్ని కాంట్రాక్టర్ పదినెలల కిందట మొదలుపెట్టారు. ఈ నిర్మాణం నత్తనడకను తలపిస్తుంది. ఓవైపున వెట్‌మిక్స్ సరిగా లేకుండా కంకరతోనే నిర్మిస్తున్న ఈ రోడ్డులో నాణ్యత లోపించిందనే విమర్శలు కూడా ఉన్నాయి. వాటర్ క్యూరింగ్ లేక విపరీతమైన దుమ్ముతో వాహనచోదకులు, ప్రజలు అల్లాడిపోతున్నారు. ఓ అధికార పార్టీ నేత కుమారుడే ఈ రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తుండటంతో ఆర్అండ్‌బీ అధికారులు నిస్సహాయులుగా చేస్తున్న పనులను చూస్తూ ఉండిపోతున్నారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారనే విమర్శలున్నాయి. ఈ రోడ్డు నిర్మాణంతో వాహనచోదకులు, ప్రజలు పది నెలలుగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, నాణ్యతతో ఈ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నివర్గాల ప్రజలు కోరుతున్నారు.

సామినేని హరిప్రసాద్‌కి ఎంపీ వద్దిరాజు పరామర్శ



నాగమణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వద్దిరాజు రవిచంద్ర

ముదిగొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సతీమణి సామినేని నాగమణి ఇటీవల మృతి చెందింది. ఆదివారం మండల పరిధిలోని మేడేపల్లి గ్రామంలో హరిప్రసాద్ కుటుంబాన్ని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పరామర్శించారు. నాగమణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, పోట్ల వెంకటప్రసాద్, గడ్డం వెంకటి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఉపకేంద్రం అసిస్టెంట్ ఇంజనీర్ వెంకట్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



వైరాలో నెమలి బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తుందని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం వైరా బస్టాండ్‌లో వైరా నుంచి గన్నవరం మీదుగా నెమలి వెళ్లే నూతన బస్సు సర్వీస్‌ను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రారంభించారు. గన్నవరం, ఖానాపురం, కొండకొడిమ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలతో కలిసి బస్సు సర్వీస్‌ను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మహిళలు సహా అర్హులైన పేదలందరికి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామాలయంలోని కాంప్లెక్స్ భవన సముదాయాన్ని ప్రారంభించారు. శ్రీకోదండ రామాలయంలో పూజలు చేశారు. మధిర డిపో మేనేజర్ శంకర్‌రావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా, కొణిజర్ల మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, వడ్డే నారాయణ, పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, శీలం సీతారావమ్మ, యరమల సౌజన్య, రంగారావు పాల్గొన్నారు.

పేదలందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలి

» వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంతో సంబంధం లేకుండా అర్హత కలిగిన పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఆత్మీయ భరోసా పథకం వర్తింప చేయాలని సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకండ కాంతయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆత్మీయ భరోసా పథకానికి 20 రోజులు పని ప్రతిపాదన ద్వారా పేదలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పరిశీలన చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. సమావేశంలో తాటి వెంకటేశ్వర్లు, దండు ఆదినారాయణ, అయోధ్య, రామలక్ష్మి, కంపసాటి వెంకన్న, బాణోత్ రామూర్తి పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ : సండ్ర



జామే మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, మార్చి16 (ఆంధ్రజ్యోతి): ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం పట్టణంలోని జామే పెద్ద మసీద్‌లో ముస్లిం సోదరులకు అంబులెన్స్ అజార్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు ఖర్జూర పండ్లు తినిపించి రోజా విడిపించారు. అన్నిమతాలకు స్వేచ్ఛాయుత వాతావరణం ఈ రాజ్యాంగం ప్రజాస్వామ్య దేశంలో కల్పించబడిందని, మనమంతా అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మసీద్ సదర్ నాయబ్‌రసూల్, ఎస్‌కే.రఫీ, అజార్, చాంద్‌పాషా, ఆయూబ్‌పాషా, మదార్, మల్లూరి అంకంరాజు, వల్లభనేని పవన్, అద్దంకి అనిల్, పర్వతనేని వేణు, అమరవరపు కృష్ణారావు, శ్రవణ్, రంగారావు, బాబూరావుపాల్గొన్నారు.

'పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే'



సత్తుపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సత్తుపల్లిరూరల్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): మాకు ఎన్‌జీటీ వంటి వ్యవస్థపై విశ్వాసం ఉందని, వారిమాట ప్రకారం బాధితులకు తప్పనిసరిగా పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బీజేపీ నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ 34రోజులుగా మండలంలోని కిష్టారంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలను రాష్ట్రమంత్రి, స్థానిక ఎమ్మెల్యే హామీతో తాత్కాలికంగా విరమించగా చిత్తశుద్ధితో పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రులు అమిత్ షా, కిషన్‌రెడ్డి, భూపేంద్రయాదవ్‌ల దృష్టికి బీజేపీ జాతీయ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి తీసుకెళ్లారని, ఈ క్రమం లో విజిలెన్స్, పర్యావరణ పరిరక్షణ, పునరావాసం తదితర అంశాలపై దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో భాస్కర్ల వీరంరాజు, సుదర్శన్‌మిశ్రా, పాలకొల్లు శ్రీనివాస్, విజయ్, శివ, శేషగిరి ఉన్నారు.

అనంతరామయ్య ఆశయాలు సాధించాలి



అనంతరామయ్య స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొణిజర్ల, మార్చి16(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రజలకు విశేషసేవలందించి ప్రజల ఆదరాభిమానాన్ని పొందిన యాసా అనంతరామయ్య ఆశయాలు సాధించాలని సీపీఎం జిల్లా నాయకులు తాళ్లపల్లి కృష్ణ కొనియాడారు. ఆదివారం మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో జరిగిన ఆయన వర్ధంతి సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు, చల్లా నారాయణ, మండల పార్టీ కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్, చింతనిప్పు సూరయ్య, యాసా వెంకటేశ్వర్లు, నారాయణరావు, పాపిట్ల ఏసు, అప్పికట్ల రామారావు, యాసా తిలక్, యాసా లక్ష్మి, రామారావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం, పౌష్టికాహారంతో ఆరోగ్యం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ భారవి

వైరా, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేసి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఖమ్మానికి చెందిన డాక్టర్ చీకటి భారవి, బోడేపూడి కళానిలయం కార్యదర్శి బొంతు రాంబాబు పేర్కొన్నారు. వైరాలో బోడేపూడి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రోగులను డాక్టర్లు చీకటి భారవి, జట్ల రంగారావు, పిల్లలమర్రి సుబ్బారావు పరీక్షించారు. మాజీ ఎంపీపీ బొంతు సమత, సభ్యులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు, గుడిమెట్ల రజిత, మోహన్‌రావు, మల్లెంపాటి ప్రసాదరావు పర్యవేక్షించారు.

పొట్టి శ్రీరాములు జయంతి



కల్లూరులో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

కల్లూరు, మార్చి16 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీహెచ్ఎస్ఆర్ మండపంలో ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు ప్రసంగిస్తూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని అన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అనుమోలు శ్రీనువాసరావు, సంకా రాంబాబు, చారుగుండ్ల మురళి, చిన్న భద్రరావు, జి రామకోటేశ్వరరావు, చారుగుండ్ల అచ్యుత సీతారామారావు, సముద్రాల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మధిరటౌన్‌లో...

మధిరటౌన్: పొట్టి శ్రీరాములు 124వ జయంతిని ఆదివారం మధిరలో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య కల్యాణమండపంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇరుకుళ్ల రాధాకృష్ణ, కురెవెళ్ల కృష్ణ, మాదవరపు నాగేశ్వరరావు, చారుగుళ్ల నరసింహమూర్తి, పల్లపోతుల ప్రసాదరావు పాల్గొన్నారు.



మధిరటౌన్‌లో...

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల దిష్టిబొమ్మల దహనం



వైరాలో జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు

వైరా, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీలో దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను దొర అహంకారంతో అవమానించటాన్ని నిరసిస్తూ ఆదివారం వైరాలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేక దొర అహంకార పార్టీ అని ఎమ్మెల్యే విమర్శించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా, కొణిజర్ల మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు పాల్గొన్నారు.



బోనకల్‌లో...

సత్తుపల్లిరూరల్‌లో...

సత్తుపల్లిరూరల్: దళిత స్పీకర్, బీసీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను సత్తుపల్లి రింగ్‌సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం దహనం చేశారు.

కల్లూరులో...

కల్లూరు: తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కేటీఆర్ అవమానకరంగా మాట్లాడినందుకు నిరసనగా ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ శ్రేణులు కేటీఆర్, జగదీష్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, బాగం ప్రభాకర్‌చౌదరి, భూక్యా శివకుమార్‌నాయక్, ఏనుగు సత్యంబాబు, దారా రంగా, పాపబత్తిని నగేష్, తురాబలి, పెద్దబోయిన శ్రీను పాల్గొన్నారు.

బోనకల్‌లో...

బోనకల్: అసెంబ్లీ స్పీకర్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం బోనకల్‌లో మండల కాంగ్రెస్ నాయకులు జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, జిల్లా నాయకుడు పైడిపల్లి కిషోర్ కుమార్, నల్లమోతు సత్యనారాయణ, చేబ్రోలు వెంకటేశ్వర్లు, బండి వెంకటేశ్వర్లు, గూడ నర్సయ్యశాస్త్రీ, నిమ్మతోట జనప్రియ కుమార్, బద్రు నాయక్, పిల్లలమర్రి నాగేశ్వరరావు, గుగులోతు రమేష్, మరీదు శ్రీనివాసరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

మధిరటౌన్‌లో..

మధిరటౌన్: స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఆదివారం మధిరలో కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, దుంపా వెంకటేశ్వర రెడ్డి, మునుగోటి వెంకటేశ్వరరావు, గద్దల మాధురి, చిట్టిబాబు, మధార్, హరిబాబు, కర్నాటి రామారావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



గ్రూప్-2,3 విజేతలను సన్మానిస్తున్న ఎంఈవో

తల్లాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడి, ఆందోళన లేకుండా ఆత్మస్థైర్యంతో సమర్థవంతంగా రాయాలని ఎంఈవో ఎన్.దామోదర్‌ప్రసాద్, ఎస్ఐ బి.కొండల్‌రావు సూచించారు. శనివారం రాత్రి స్థానిక బాలభారతి విద్యాలయంలో నిర్వహించిన పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో వారు పాల్గొని మాట్లాడారు. ఇటీవల ప్రకటించిన గ్రూప్-2,3 ఫలితాల్లో ప్రతిభను కనపర్చిన దుగ్గిదేవర వెంకటేశ్వరరావు, కటికి ఉపేందర్‌రావులను సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, డైరెక్టర్ శ్రావణి, ప్రిన్సిపల్ తాళ్లూరి రామారావు, ఏవో శశాంక్ పాల్గొన్నారు.

శరవేగంగా పెనుబల్లి-గంగదేవిపాడు వంతెన నిర్మాణం



జరుగుతున్న వంతెన నిర్మాణ పనులు

పెనుబల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పెనుబల్లి-గంగదేవిపాడు గ్రామాల మధ్య రాతోని అలుగువాగుపై వంతెన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వంతెన నిర్మించాలని దశాబ్దాల కాలంగా పెనుబల్లి, గంగదేవిపాడు, తాళ్లపెంట, సీన్యాతండా గ్రామస్థులు ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నారు. ఈ పనులకు గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రత్యేక చొరవ తీసుకొని రూ.5.75కోట్లు మంజూరు చేశారు. దీంతో 2023 సెప్టెంబరు 27న అప్పటి రోడ్లు భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే మట్టా రాగమయిని ఈ వంతెన నిర్మాణపనులు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరారు. దీంతో ఎమ్మెల్యే చొరవ తీసుకొని రోడ్లు భవనాలశాఖ అధికారులను సంప్రదించడంతో గత మూడునెలలుగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో వచ్చే జూన్ నాటికి నిర్మాణ పనులను పూర్తి చేసుకొని వంతెనను ప్రారంభింపజేస్తామని రోడ్లు భవనాలశాఖ ఏఈ గోపి తెలిపారు. ఈ వంతెన నిర్మాణం పూర్తైయితే పెనుబల్లి నుంచి తాళ్లపెంట, గంగదేవిపాడు వెళ్లే ప్రజలు, రైతులు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

పెనుబల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1,2,3 ఇతర ఉద్యోగాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా నియామకాలు చేపట్టొద్దని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఎమ్మార్పీఎస్ రిలే నిరాహారదీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ దీక్షలను విశ్రాంత ఉపాధ్యాయుడు, కవి, రచయిత గోపిశెట్టి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలికపోగు వెంకటేశ్వరరావు, ఎంఎస్పీ నాయకులు జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, కోట ప్రసాద్, మరకాల ప్రభు, శ్రీను, భాస్కర్, వెంకటేశ్వరరావు, మధు, మంచాల బ్రహ్మం, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న నాయకులు

భట్టి పాదయాత్రతో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు



కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మధిరటౌన్, మార్చి16(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు సీఎల్పీ నాయకుడి హోదాలో నాడు మల్లు భట్టి విక్రమార్క పిపుల్స్‌మార్చ్ పేరుతో చేపట్టిన పాదయాత్ర రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు దోహదం చేసిందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. భట్టి పాదయాత్ర చేపట్టి నేటికి రెండేళ్లు అవుతున్న సందర్భంగా ఆదివారం మధిరలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు కేక్‌కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు దుంపా వెంకటేశ్వర రెడ్డి, మునుగోటి వెంకటేశ్వరరావు, గద్దల మాధురి, చిట్టిబాబు, మధార్, హరిబాబు, కర్నాటి రామారావు నాయకులు నిడమానూరు వంశీ, దారా బాలరాజు, పాటిబండ్ల సత్యంబాబు, యన్నం కోటేశ్వరరావు, చావలి రామరాజు, నరసింహరావు పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి కల్యాణం

ముదిగొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం కమలాపురం అంకమ్మ దేవాలయంలో శ్రీమహాలక్ష్మీ అమ్మవారి కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ క్రతువును అర్చకులు పురాణం సతీష్‌శర్మ, బలగం భార్గవ్‌శర్మ, పురాణం సురేష్‌శర్మ, పురాణం చరణ్‌శర్మలు నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించటానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా శ్రీమహాలక్ష్మి అమ్మవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కమలాపురం, అయ్యగారిపల్లిలో ఉదయం గ్రామప్రభల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా అంకమ్మ దేవాలయానికి చేరుకున్నాయి. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం అంకమ్మ దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మహాలక్ష్మి అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు